
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 20 । జూన్ । 2025



పల్లె రోడ్లు గుల్ల

పశ్చిమ ప్రకాశంలోని గ్రామాలకు వెళ్లే పలు ప్రధాన, అంతర్గత రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రయాణికులు నరకం చూస్తున్నారు.

- IIలో..



వెన్నుపోటుకు బాబు బ్రాండ్ అంబాసిడర్

సీఎం చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం 37 /29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

23న ఒంగోలులో వైఎస్సార్ సీపీ నిరసన ర్యాలీ

దర్శి (కురిచేడు): సీఎం చంద్రబాబునాయుడు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి హామీలు నెరవేర్చనందుకు నిరసనగా ఈ నెల 23వ తేదీ ఒంగోలులో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ఒంగోలులోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు, నియోజకవర్గాల అధ్యక్షులు, విద్యార్థి విభాగం నాయకులు, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

22 నుంచి గురుకులాల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 22వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత పొందిన వారికి రెండు దఫాలుగా అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఈ నెల 22వ తేదీ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దర్శిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్‌కు 23న, సింగరాయకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్‌కు 26న, దర్శి పాఠశాలలో బాలురకు 27న కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు జరుగుతాయన్నారు. అదేవిధంగా జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకూ 2025–26 విద్యా సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 25న మార్కాపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికలకు, 25న దర్శి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలురకు అడ్మిషన్ల పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాల ద్వారా వారికి కేటాయించిన రోస్టర్ పాయింట్ల ఆధారంగా అడ్మిషన్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు వారు చేరగోరే పాఠశాలలలో దరఖాస్తులను ఈ నెల 23వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

అడవి చేరక.. వేట నేర్వక.!

అటవీశాఖ నిర్లక్ష్యం పులి కూనలకు శాపంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా పులిపిల్లల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం రూ.2 కోట్లు నిధులిచ్చింది. పనులు కూడా ప్రారంభించారు. అయితే అవి అర్ధంతరంగా నిలిచిపోయాయి. సంవత్సర కాలంగా పనులు ఆగిపోవడంతో విలువైన పరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పులికూనలు పెరిగి పెద్దవైపోతుండడం గమనార్హం.



నిరుపయోగంగా ఉన్న ఎన్‌క్లోజర్ల కోసం తెచ్చిన సామగ్రి



- తెలుగు రాష్ట్రాల్లో తొలి పులికూనల సంరక్షణ కేంద్రం
- ప్రకాశం జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటుకు నిర్ణయం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లు విడుదల
- అటవీశాఖ నిర్లక్ష్యంతో నెరవేరని పులి పిల్లల సంరక్షణ
- ఉన్నతాధికారుల బదిలీలతో పనుల నిలిపివేత
- ఇప్పటికే పెరిగి పెద్దవిగా మారిన బెబ్బులులు

పెద్దదోర్నాల:

- రెండేళ్ల కిందట నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురంలో నాలుగు ఆడపులి పిల్లలు తల్లి నుంచి విడిపోయి దిక్కుతోచని స్థితిలో స్థానికుల కంటపడ్డాయి. ఈ క్రమంలో అవి పెరిగి పెద్దవవుతుండటంతో వాటిని సహజ సిద్ధంగా ఉండే అటవీ ప్రాంత వాతావరణంలో వదిలి పెట్టేందుకు అటవీశాఖ గతంలో నిర్ణయం తీసుకుంది.
- తిరుపతి జూ పార్కులోనూ తల్లి నుంచి విడిపోయి విడిగా పెరుగుతున్న పిల్లలను ప్రత్యేకంగా సంరక్షించాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు.

చిన్నప్పుడే తల్లి నుంచి విడిపోయిన పులి కూనలను జూలలో సంరక్షించేవారు. దీంతో అవి సహజ స్వభావాన్ని కోల్పోతున్నాయి. పులి పిల్లలను అటవీ ప్రాంతంలోనే ఉంచి వేట నేర్పేందుకు నల్లమల అభయారణ్యంలో భారీ టైగర్ ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేయాలని అటవీశాఖ నిర్ణయించింది. జిల్లాలోని నెక్కంటి రేంజ్ పెద్దపెంట ప్రాంతం ఇందుకు అనువైనదిగా గుర్తించారు. పెద్దపెంట, ఆరపెంట, గంగారంపెంట, పెద్దదోర్నాల మండలంలోని తెట్టుగూడెం పరిధిలో టైగర్ ఎన్‌క్లోజర్‌తో పాటు నర్సరీ, హెర్బివోస్‌ల ఎన్‌క్లోజర్లు నిర్మించాలని ప్రతిపాదనలు చేసింది. దీనికి సంబంధించి అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది.

మందగించిన నిర్మాణ పనులు...

15 హెక్టార్లలో నాలుగు ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేయాలకున్నారు. తొలుత 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నర్సరీ ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేసి అందులో పులి కూనలను ఉంచి కోడి, మేక మాంసాన్ని ఆహారంగా ఇస్తారు. ఆ తర్వాత మరో ఎన్‌క్లోజర్లోకి మార్చివేసి చిన్నపాటి మేకలను వదులుతారు. సొంతంగా వేటాడేలా నేర్పిస్తారు. అనంతరం మరో ఎన్‌క్లోజర్లో ఉంచి జింకలు, దుప్పులు, ఇతర వన్యప్రాణులను వదులుతారు. ఇలా వన్యప్రాణులను వేటాడిన తర్వాత వాటిని అడవిలోకి వదులుతారు. కానీ, అటవీశాఖ నిర్లక్ష్యంతో తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా పులుల సంరక్షణ ప్రక్రియకు ప్రయోగాత్మకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరకుండా పోయింది.

సొంతంగా వేటాడగలిగేలా..

మొదటిగా నర్సరీ ఎన్‌క్లోజర్‌లో ఉంచిన పులి పిల్లలను టైగర్ ఎన్‌క్లోజర్‌లోకి మార్చి వ్యక్తిగతంగా ఆహారం కోసం అవి 50 వన్యప్రాణులను సొంతంగా వేటాడగలిగినప్పుడే అభయారణ్యంలోకి వదులుతారు. దీంతో పెద్దపులులు వేటాడటం కోసం నెక్కంటి రేంజి పరిధిలోని ఆరపెంట, గంగారంపెంట, పెద్దదోర్నాల మండల పరిధిలోని తెట్టుగూడెం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెర్బివోస్ (జింకలు, దుప్పుల) నర్సరీలు సైతం నిరుపయోగంగా మారాయి. ఇందుకోసం ఆయా ఎన్‌క్లోజర్‌లలో రూ.2.50 లక్షలతో సోలార్ బోరుతో పాటు ఎన్‌క్లోజర్‌లోకి పైప్‌లైన్ సదుపాయం, జింకల అవసరాలు తీర్చేందుకు సాసర్‌పిట్లు, సహజ సిద్ధంగా ఉండే నీటి గుంతలు సైతం ఏర్పాటు చేశారు. సాధారణంగా కొద్ది రోజుల పాటు వాటిని సంరక్షించిన అనంతరం పులుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లలో వదలటం ద్వారా పులులకు వేటాడటాన్ని అలవాటు చేస్తారు. వేటలో వాటి శక్తియుక్తులను గుర్తించి తదుపరి చర్యలు తీసుకుంటారు. అయితే, ఇవేమీ జరగకుండానే టైగర్ ఎన్‌క్లోజర్ పనులు మందగించాయి. ప్రస్తుతం తిరుపతి జూలో ఉన్న అవి పెరిగి పెద్దవిగా అయిపోయాయి.



నంద్యాల జిల్లాలో రెండేళ్ల కిందట తల్లికి దూరమైన పులి కూనలు

ఎన్‌క్లోజర్ పనులకు కొత్తగా టెండర్లు



అధికారుల బదిలీలు, గతంలో భారీ వర్షాల కారణంగా పనులు కొంత మేర మందగించాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయితే పనులు చురుగ్గా జరిగే అవకాశం ఉంది. కొత్తపల్లి పులి పిల్లలు పెద్దవి కావటంతో వాటిని తీసుకొచ్చే అంశం పరిశీలనలో ఉంది.

– ప్రసన్నజ్యోతి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కొర్రప్రోలు

లాసెట్ ఫలితాలు విడుదల



కొర్సపాటి ప్రశాంత్

ఒంగోలు సిటీ: పీజీ, బీఎల్, ఎల్ఎల్‌బీ లాసెట్ ఫలితాలను పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. పీజీ లా కోర్సులో ప్రవేశాలకు ఒంగోలుకు సంబంధించి 78 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 65 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. 63 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒంగోలు నగరం గాంధీనగర్ కొత్తడొంకకు చెందిన కొర్సపాటి సంతానయ్య కుమారుడు ప్రశాంత్ మూడో ర్యాంక్ సాధించాడు. ప్రశాంత్ తన స్కూల్ ఎడ్యుకేషన్‌ను చీమకుర్తి పబ్లిక్ స్కూల్లో, ఇంటర్‌ను ఒంగోలు నారాయణ కాలేజీలో, బీటెక్‌ను గుంటూరు ఆర్‌వీఆర్ జేసీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో, ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజీ ఆఫ్ లాలో ఎల్ఎల్‌బీ విద్య అభ్యసించారు. ఇదే విభాగానికి సంబంధించి మార్కాపురంలో 23 మంది దరఖాస్తు చేసుకోగా, 22 మంది పరీక్షకు హాజరై అందరూ ఉత్తీర్ణులయ్యారు. బీఎల్, ఎల్ఎల్‌బీ మూడు సంవత్సరాల కోర్సులో ప్రవేశాలకు సంబంధించి ఒంగోలు కేంద్రంలో 773 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 579 మంది హాజరు కాగా, 194 మంది గైర్హాజరయ్యారు. 576 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే మార్కాపురంలో 231 మంది దరఖాస్తు చేసుకోగా 183 మంది హాజరయ్యారు, 48 మంది గైర్హాజరవగా, 181 మంది అర్హత సాధించారు. బీఎల్, ఎల్ఎల్‌బీ ఐదు సంవత్సరాల కోర్సుకు సంబంధించి ఒంగోలులో 190 మంది దరఖాస్తు చేసుకున్నారు. 151 మంది పరీక్షకు హాజరవగా, 39 మంది గైర్హాజరయ్యారు. 139 మంది ఉత్తీర్ణత సాధించారు. మార్కాపురంలో 56 మంది దరఖాస్తు చేసుకోగా, 46 మంది పరీక్షకు హాజరయ్యారు. 43 మంది పాసయ్యారు.

23 నుంచి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8309915577 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- పోలీస్, ఎక్సైజ్ అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్ష



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ఒంగోలు సబర్బన్: నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. నాటుసారా నిర్మూలన కార్యక్రమమైన నవోదయం 2.0పై స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటిస్తూ డిక్లరేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 19న రాష్ట్ర స్థాయి నవోదయం 2.0 కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించుకుని నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు సంకల్పం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల సహకారంతో గత నాలుగు నెలల కాలంలో జిల్లాలో నాటుసారా తయారీదారులు, వినియోగదారులకు అవగాహన కల్పించడం, నాటుసారా యూనిట్లను నిర్మూలించడం వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీనివలన ప్రకాశం జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించడానికి అవకాశం కలిగిందన్నారు. ఒకసారి నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించిన తర్వాత ఎక్కడా నాటుసారా తయారీ, వినియోగం జరగకుండా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఐడీ లిక్కర్ పీడిత గ్రామాల జాబితాను 8 మండలాల్లో ఎ.బి.సి. కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఏ కేటగిరీలో 2 గ్రామాలు, బీ కేటగిరీలో 27 గ్రామాలు, సీ కేటగిరీలో 6 గ్రామాలు కలిపి మొత్తం 35 గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో నాటుసారాను నిర్మూలించి లక్ష్యం చేరుకునేలా పనిచేయాలన్నారు. ఆ వృత్తి నుంచి వారి కుటుంబాలను దూరం చేసి సమాజంలో గౌరవప్రదమైన ఉపాధి మార్గాలను వారికి కల్పించేలా రాయితీలు, పథకాలు అందించాలని సూచించారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ క్షేత్రస్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం నవోదయం 2.0పై అవగాహన కల్పించే కరపత్రాలు, వాల్ పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలన శూన్యం

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున



నాగన్నపాలెం గ్రామ కమిటీకి పార్టీ కండువాలు వేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. మద్దిపాడు మండలంలోని నాగన్నపాలెం, లింగంగుంటలో గురువారం పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనలో ఏమీ సాధించలేక పోయిందని విమర్శించారు. కేవలం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం మినహా వారు సాధించిందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేసిన ఘనతను మూటగట్టుకుందన్నారు. ప్రజలకు కల్లబొల్లి హామీలిచ్చి అధికారంలోకి రావడం, మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 80 లక్షల మంది విద్యార్థులకుపైగా అమ్మ ఒడి డబ్బు జమచేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేవలం 62 లక్షల మందికి మాత్రమే నగదు జమ చేసిందని దుయ్యబట్టారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మేరుగు నాగార్జున తెలిపారు. రైతుల కోసం జగనన్న పోరుబాటను సహించలేక భగ్నం చేయడానికి ప్రయత్నించిన ఘనులు కూటమి నాయకులు అని ఆయన మండిపడ్డారు. కూటమి సర్కార్ సంవత్సర కాలంగా ప్రజలకు ఏమీ చేయకుండా జగన్ నామస్మరణ మాత్రమే చేస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పూర్తిస్థాయిలో పట్టు సాధించే దిశగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాగన్నపాలెం గ్రామ అధ్యక్షునిగా పైనం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాతిక్రింది జాన్ ప్రకాష్, పైనం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులుగా పైనం శ్రీనివాసరావు, పైనం అంకయ్య, పోకూరి హనుమంతరావు, మరికొందరు సభ్యులను ఎంపిక చేశారు. లింగంగుంట గ్రామ అధ్యక్షునిగా మెడబలిమి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. వారికి మేరుగు నాగార్జున పార్టీ కండువాలు కప్పి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, నాయకులు పల్లపాటి అన్వేష్, బొమ్మల రామాంజనేయులు, గుడ్లపాతల రవి, నాదెండ్ల మహేష్, రజని, సంధ్య, దుడ్డు వినోద్, గద్దె జాలయ్య, కంకణాల సురేష్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులపై మరోసారి వేధింపులు

- ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్‌పై నగరపాలక సంస్థ అధికారుల దాడులు
- కరోనా సమయంలో కట్టాల్సిన అద్దెల విషయంలో షాపులకు తాళాలు
- ముందు రోజే కరెంటు కట్
- రెండు నెలల క్రితం మార్కెట్ ఛిన్నాభిన్నం
- ప్రభుత్వంతో మాట్లాడతానని అప్పట్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే దామచర్ల
- ప్రస్తుతం ఆయన లేని సమయంలో అధికారుల దాడులపై అనేక అనుమానాలు
- వైఎస్సార్ సీపీ వర్గీయులే లక్ష్యంగా వ్యూహాత్మకంగా వేధిస్తున్నారంటూ ఆరోపణలు

ఒంగోలు సబర్బన్:

నగరంలో కొత్త కూరగాయల మార్కెట్లోని షాపుల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై నగరపాలక సంస్థ అధికారుల వేధింపులు మరోసారి కొనసాగాయి. మార్కెట్లోని షాపులకు కరోనా సమయంలో అద్దెలు చెల్లించలేదన్న కారణంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలక సంస్థ అధికారులు రెండు నెలల క్రితం దాడులు చేసి మార్కెట్‌ను ఛిన్నాభిన్నం చేశారు. వ్యాపారులను భయాందోళనకు గురిచేశారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన వారి షాపులను టార్గెట్ చేసి వేధించారు. ఆ సమయంలో వ్యాపారులంతా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కరోనా సమయంలో అన్ని వ్యాపారాలను నిలిపివేయడంతో ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్‌ను కూడా మూసివేశారు. 2019–20, 2020–21 సంవత్సరాల్లో స్థానిక పీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్లో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి కూరగాయలు విక్రయించారు. నగర ప్రజలతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు అక్కడికే వెళ్లి కూరగాయలు కొనుగోలు చేశారు. కానీ, కరోనా సమయంలోనూ కూరగాయల మార్కెట్‌లోని షాపులకు బాడుగలు కట్టాలంటూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యాపారులపై వేధింపులు ప్రారంభించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి వ్యాపారులు తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనేకసార్లు సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే స్థానికంగా లేని సమయంలో గురువారం ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు మార్కెట్లోని రిటైల్ షాపులకు తాళాలు వేశారు.

పోలీసులను తీసుకెళ్లి మరీ...

మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు పోలీసులను తీసుకెళ్లి మరీ మార్కెట్లోని రిటైల్ షాపులకు తాళాలు వేయించారు. ఇది ఎమ్మెల్యే దామచర్ల వ్యూహమా.. లేకుంటే మేయర్, కమిషనర్ వేధింపులా అనేదానిపై రకరకాల రూమర్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని మార్కెట్‌లో సమావేశం ఏర్పాటు చేసిమరీ బహిరంగంగా దామచర్ల చెప్పిన తర్వాత కూడా గురువారం ఆయన లేని సమయంలో షాపులకు తాళాలు వేయడం, బుధవారం రాత్రే విద్యుత్ సరఫరా కూడా నిలిపివేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవన్నీ ఎమ్మెల్యేకి తెలియకుండా జరిగే అవకాశం లేదని, ఆయన ఆదేశాల మేరకే వ్యాపారులపై వేధింపులు జరుగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానంటూ పైకి ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ.. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన వ్యాపారులను వేధించేందుకు, పొమ్మనలేక పొగబెట్టేందుకు, తాను ఇక్కడ లేని సమయంలో షాపులపై దాడులు చేయాలని అధికారులకు ఆయనే చెప్పి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో మొత్తం 193 షాపులున్నాయి. వాటిలో 123 రిటైల్ షాపులు, 70 హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. వీటిలో కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల షాపులను మాత్రమే నగరపాలక సంస్థ అధికారులు టార్గెట్ చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరుల షాపుల జోలికి వెళ్లడం లేదు. దాదాపు 60 షాపులకు గురువారం తాళాలు వేశారు. తమను ఈ విధంగా ఎంతకాలం వేధిస్తారంటూ షాపుల యజమానులు గగ్గోలుపెడుతున్నారు.



షాపులకు తాళాలు వేయిస్తున్న అధికారులు


బేస్తవారిపేట : అధ్వానంగా జేబీకే పురం రోడ్డు


బేస్తవారిపేట : ఛిద్రమైన చింతలపాలెం ప్రధాన సీసీ రోడ్డు


బేస్తవారిపేట : పశువుల దిబ్బలా వంగపాడు ఎస్సీ కాలనీ రోడ్డు

పల్లె రోడ్లు గుల్ల

- నరకప్రాయంగా మారుతున్న ప్రయాణం
- ప్రధాన, అంతర్గత రహదారుల మరమ్మతులు శూన్యం
- కేవలం మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం


బేస్తవారిపేట : కోనపల్లె లోయ రోడ్డులో దెబ్బతిన్న మార్జిన్లు

బేస్తవారిపేట/పెద్దారవీడు: రహదారుల నిర్మాణం, మరమ్మతులను ప్రభుత్వం గాలికొదిలేయడంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. గోతులమయంగా మారిన, కంకర తేలిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా కొత్త రోడ్లు వేయలేదు సరికదా పాడైన రోడ్లకు సైతం మరమ్మతులు చేయలేదని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో రోడ్లపై గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు.. ప్రస్తుతం రహదారుల పరిస్థితిపై మాత్రం నోరు మెదపడం లేదు. పలు గ్రామాల్లో కూటమి నాయకులు తమకు అనుకూలంగా ఉండే వీధుల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిమెంటు రోడ్లు వేసుకోవడంపై చూపిన శ్రద్ధ, రాష్ట్రీయ, జాతీయ రహదారులను అనుసంధానం చేస్తే లింక్ రోడ్ల మరమ్మతులపై పెట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రయాణం.. ప్రాణాపాయం

☛ బేస్తవారిపేట మండల కేంద్రం నుంచి జేబీకే పురం, చిన్న కంభం, జేబీకే పురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే బీటీ రోడ్డు గోతులమయంగా మారింది. లోతైన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఏదో ఒక పనిపై మండల కేంద్రానికి వచ్చే జేబీకే పురం గ్రామస్తులు, పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడుతున్నారు.

☛ చింతలపాలెంలోకి వెళ్లే ప్రధాన సీసీరోడ్డు ఛిద్రమైంది. రోడ్డంతా గుంతలు, పగుళ్లతో దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని చింతలపాలెం, హరజరత్‌గూడెం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెద్దారవీడు : పోతంపల్లి వెళ్లే తారు రోడ్డుపై లేచిన కంకర

☛ బేస్తవారిపేట మండలంలోని వంగపాడులో మెయిన్ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీలోకి వెళ్లే సీసీ రోడ్డు పశువుల దిబ్బగా మారింది. పశువుల వ్యర్థాలను సీసీ రోడ్డుపైనే వేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై వ్యర్థాలు వేయకుండ చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

☛ కోనపల్లె లోయకు వెళ్లే తారురోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లు కొట్టుకుపోయాయి. మార్జిన్లలో భారీ గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకల సమయంలో తంటాలు తప్పడం లేదు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణాలతో చెలగాటమే. దాదాపు 30 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు అభివృద్ధిపై పాలకులు దృష్టిపెట్టాలని లోయ ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


పెద్దారవీడు : ప్రగళ్లపాడులో మెయిన్ రోడ్డు పరిస్థితి ఇదీ..

☛ పెద్దారవీడు మండలంలోని చట్లమిట్ల అడ్డరోడ్డు నుంచి రేగుమానిపల్లి, అలాగే ఏనుగుదిన్నెపాడు నుంచి తోకపల్లి, చట్లమిట్ల నుంచి బద్వీడు గ్రామాలకు వెళ్లే తారు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గోతులు పడి, కంకర రాళ్లు పైకి తేలడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ నరకమే..



రోడ్లపై తారు లేచి, పెద్ద పెద్ద గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి పూట రోడ్డుపై గుంతలు కనిపించక బైకులపై వెళ్లేవారు కింద పడి గాయాలపాలవుతున్నారు. మూలమలుపుల వద్ద చిల్లకంప రోడ్డు మీదకు రావడంతో ఎదురుగా వచ్చే ఏ వాహనమూ కనిపించడం లేదు. వర్షం పడితే రోడ్లపై గుంతలు నీటితో నిండిపోయి ఎటు వెళ్లాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నాం.

– గజ్జ యోగిగురవారావు, ప్రగళ్లపాడు(పెద్దారవీడు)

జంగిల్ క్లియరెన్స్ పనులేవీ?


పెద్దారవీడు : బద్వీడు గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా కమ్మేసిన చిల్లచెట్లు

గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా చిల్ల చెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. మూలమలుపుల వద్ద చిల్లకంప రోడ్డును కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి నూతన రహదారులు నిర్మించడంతోపాటు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీసీఆర్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, చట్టంలోని సెక్షన్ 12(1)సి ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాల్లో 25 శాతం విద్యార్థులకు ఉచితంగా విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ జిల్లా కో కన్వీనర్ ఎంఏ సాలార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాలార్ మాట్లాడుతూ...ఇప్పటికీ అనేక మంది నిరుపేద విద్యార్థులు ఫీజులు చెల్లించే స్తోమత లేకపోవడంతో చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ జాప్యం కావడంతో కొందరు విద్యార్థులు కాలేజీలకు వెళ్లకుండా పనులకు వెళుతున్నారని తెలిపారు. విద్యా, వైద్యం ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడం ద్వారా అందరికీ విద్యా సమానత్వం లభిస్తుందని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కందుల ఐలయ్య వున్నారు.

గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పన


మాట్లాడుతున్న ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఐటీడీఏ ప్రత్యేకాధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పాలుట్ల, గుట్టచేను గిరిజన గూడాల్లో దర్తి ఆబజన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం, ఆరోగ్యం, వ్యవసాయం, రోడ్లు, విద్య, హాస్టల్స్, టెలికాం సర్వీసులు, సాంకేతిక అభివృద్ధి, నైపుణ్య వికాసం లాంటి 17 మంత్రిత్వ శాఖల సమన్వయంతో 25రకాల కార్యచరణాలు చేపడుతున్నామన్నారు. గిరిజన గూడాలలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు కుల ధృవీకరణ పత్రాలు లేనివారిని గుర్తించి వారికి అందచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీడబ్ల్యూఓ లక్ష్మి పాలుట్లలోని ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యాబుద్ధుల బోధన వివరాలను హెచ్ఎం తాటి బైస్వామి, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాలుట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వరనాయక్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గిరిజనులను పరీక్షించారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు కరంతోటి హనిమిబాయి, బోడా శ్రీశైలపతి నాయుడు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ చెవుల అంజయ్య, వీటీడీఏ అధ్యక్షుడు నిమ్మల ఈదన్న, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర నాయక్ పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బాబు బ్రాండ్ అంబాసిడర్

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


జగనంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో ఆదిమూలపు సురేష్, నేతలు

సింగరాయకొండ: వెన్నుపోటుకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం జగనంటే నమ్మకం- బాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో భాగంగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే వ్యతిరేకత వచ్చిందన్నారు. ఏడాదిలో సక్రమంగా ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేశామని, కాదన్న వాడి నాలుక మందం అని అన్నారని, 5 కోట్ల ప్రజల నాలుక మందమా అని చంద్రబాబును ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ నగదు సక్రమంగా జమ కాలేదని, తల్లికి వందనంలో భారీ కోతలు విధించి అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకంలో భారీ కోతలు కనిపిస్తున్నాయని మండిపడ్డారు.

రాష్ట్రంలో అరాచక పాలన

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవడం రాష్ట్ర ప్రజలకు అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రంలో జరుగుతుంది సంక్షేమ పాలన కాదని అరాచకపాలన అని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారన్నారు. 70 ఏళ్ల వయసున్న సీనియర్ పాత్రికేయుడు కేఎస్ఆర్‌పై అక్రమ కేసు బనాయించి జైలుకు పంపారని, సుప్రీంకోర్టు అక్షింతలు వేస్తే గానీ విడిచిపెట్టలేదన్నారు. హోంమంత్రి వంగలపూడి అనితపై చెక్ బౌన్స్ కేసు ఉందని ఆరోపించారు. నీతి, నియమాలు లేని వ్యక్తి మంత్రిగా ఉండటం మన దౌర్భాగ్యమని, వీరు శాంతిభద్రతలు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రులకు జగనన్నను తిడితే మంత్రి పదవి ఉంటుందని చంద్రబాబు కండీషన్ పెట్టినట్లు ఉందని, దీంతో మంత్రులు పోటీపడి పాలనను గాలికి వదేలిస జగనన్నపై విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. జగనన్న రైతుల సమస్యపై ప్రశ్నిస్తే తప్ప కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. సంక్షేమ పథకాలను గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కనుసన్నల్లో షర్మిల పనిచేస్తుందని, చంద్రబాబు స్విచ్ నొక్కగానే విమర్శించడం పరిపాటిగా మారిందని ఇదంతా డైవర్షన్ రాజకీయాల్లో భాగమన్నారు. చంద్రబాబు కేసులు, జైళ్లు అంటూ మా గొంతు ఎంతనొక్కుదామన్నా ఉపేక్షించేది లేదని, ప్రజా సమస్యలపై ఎలుగెత్తి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, చింతపల్లి హరిబాబు, పిన్నిక శ్రీనివాసులు, బచ్చల కోటేశ్వరరావు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, జడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

దళితురాలినని వివక్ష చూపుతారా?

- ఉప్పుగుండూరులో రూ.30 లక్షల పంచాయతీ నిధులు కాజేశారు
- కార్మికులకు మూడు నెలలుగా వేతనం నిలిపేశారు
- అధికార పార్టీ నాయకులతో సెక్రటరీ కుమ్మక్కై హింసిస్తున్నాడు
- విలేకరుల ఎదుట సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఆవేదన


మాట్లాడుతున్న సర్పంచ్ జయమ్మ

నాగులుప్పలపాడు: ×నేను ఎస్టీ మహిళను, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్‌ను అనే కారణంతో పంచాయతీ సెక్రటరీ, అధికార పార్టీ నాయకులు కలిసి వివక్ష చూపుతూ, హింసిస్తున్నారే్ని ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల ఎదుట తాను వివక్షకు గురవుతున్న తీరును వివరించారు. వారం రోజుల క్రితం వరకు పంచాయతీకి సెక్రటరీగా పనిచేసిన కిరణ్ అధికార పార్టీ నాయకుడు కనగాల శ్రీనుతో కుమ్మక్కై పన్నుల ఆదాయం , 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.30 లక్షలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఈ ఏడాది మార్చి వరకు వసూలైన పన్నుల సొమ్ము చూపకపోగా, పంచాయతీ కార్మికులకు 3 నెలలుగా వేతనం నిలిపేశారన్నారు. కార్మికులు అడిగితే సర్పంచ్ సంతకం పెట్టలేదంటూ తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వేతనం గురించి ప్రశ్నిస్తే సర్పంచ్‌నైన తననే తీవ్ర పదజాలంతో దూషించారని, చెక్ పవర్ సైతం రద్దు చేయించారన్నారు. ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చాక చెక్ పవర్ తిరిగి వచ్చినప్పటికీ, తాను సూచించిన పనులేవీ చేపట్టడం లేదన్నారు. పంచాయతీని భ్రష్టుపట్టించిన కార్యదర్శిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

ఒంగోలు టౌన్: విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గురువారం ట్రాఫిక్ పోలీసులు నగరంలో వాహనాలకు తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలను నడుతున్న 22 మందిని కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.2.20 లక్షల జరిమానా కోర్టు విధించినట్లు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని అతివేగంగా వాహనాలను నడపరాదని సూచించారు.

పశువుల బీడు ఆన్‌లైన్‌పై సభ్యుల ధ్వజం

- పశువులబీడును ఎలా ఆన్‌లైన్ చేస్తారని ప్రశ్నించిన సభ్యులు
- డిప్యూటీ తహసీల్దార్‌పై ఎంపీపీ ఆగ్రహం



పశువుల బీడు అక్రమ ఆన్‌లైన్‌పై డీటీని నిలదీస్తున్న ఎంపీపీ

మద్దిపాడు: పశువుల బీడు అక్రమంగా ఆన్‌లైన్ చేసి ఏ విధంగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తారని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి..డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ అధికారుల పనితీరుపై సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ గుండ్లసముద్రంలో పశువులు మేపుకునే బీడు భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఆన్‌లైన్ చేసి ఎలా పాసు పుస్తకాలు మంజూరు చేస్తారని మండిపడ్డారు. పేదలకు పంచకుండా భూమి ఉన్న వారికే అక్రమంగా ఏ విధంగా కట్టబెట్టారని నిలదీశారు. వారసత్వ భూమిని ఆన్‌లైన్ చేయాలన్నా ఏదో సాకు చెప్పే అధికారులు పశువుల బీడును ఆన్‌లైన్ చేయడం ఏంటని ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్ మాట్లాడుతుండగా.. కోఆప్షన్ సభ్యుడు కొండ్రు ఇజ్రాయిల్, అంకేపల్లి సర్పంచ్ తిరుపతమ్మ కలుగజేసుకుని వాటర్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, క్లోరినేషన్ చేయకపోవడంతో కలుషిత నీరు సరఫరా అవుతుందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ మానేకి సుధారాణి వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనికి వెళ్లాలంటే పచ్చ గుర్తింపు కార్డులు ఉంటేనే రమ్మంటున్నారని,

ఇదేంటని ప్రశ్నించారు. ఎంపీడీఓ జగదీష్, ఇంచార్జీ ఎంపీడీఓ నాగూర్‌వలి, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు, ఏఓ ఖాఖింపీరా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- మినీ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన


యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు: అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం పిలుపునిచ్చారు. స్థానిక మినీ స్టేడియంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో శుక్రవారం నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ.. సుమారు 5 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు యోగా కార్యక్రమానికి హాజరవుతున్నందున, వారికి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహిస్తున్న యోగా సాధన, శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో 11 లక్షల మంది యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, యోగా నిర్వహించేందుకు 6,458 ప్రదేశాలను గుర్తించామని వివరించారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు శ్రీహరి, నారాయణ, పశు సంవర్ధక శాఖ జేడీ రవికుమార్ పాల్గొన్నారు.